

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీజేపీ నాయకులు ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యాలను నిరసిస్తూ యూసుఫ్‌గూడ చౌరస్తాలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి లంకల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ద్వారా ప్రజలు ఇచ్చిన తీర్పును కించపరిచేలా రాహుల వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపించారు. పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చేలా అమెరికా ప్రతిపక్ష శాసన సభ్యురాలు ఇలాన్ ఓమర్ ను కలిసి భారతదేశ కీర్తిని కించపరిచేలా వ్యవహరించారన్నారు. అవసరం వచ్చినప్పుడు రిజర్వేషన్లు రద్దు చేస్తామని వ్యాఖ్యానించడం ఈ దేశ ప్రజల హక్కులను కాలరాయడమేనని అన్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, గంగరాజు, అట్లూరి రామకృష్ణ, బంగారు ప్రశాంత్, సునీత, చిన్న సీను తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సంస్కార్ స్కూల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో ఆరోగ్యం పట్ల కూడా అంతే జాగ్రత్తగా ఉండాలని సంస్కార్ ది లైఫ్ స్కూల్ ఫౌండర్ సీఈఓ ఎ.మోహన వంశీ అన్నారు. గురువారం ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్లో హై స్కూల్ విద్యార్థుల వరకు కంటి, దంత పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎ.మధుమతి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. గురువారం ఎర్రగడ్డ డివిజన్‌లోని హేమవతి నగర్ లో 12 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు డి.సంజీవ,నాయకులు యాదగిరి, నర్సింగ్‌రావు, బాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

బోరబండ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను, కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజలకు చేరవేయడానికి డివిజన్ పార్టీ కార్యాలయం ఉపయోగపడుతుందని కాంగ్రెస్ నాయకురాలు హబీబాసుల్తాన అన్నారు. గురువారం సైట్-2లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె డివిజన్ కార్యాయలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు సీతారాం ఏచూరి

● నివాళులర్పించిన సీపీఎం నాయకులు

బోరబండ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): జీవితమంతా ఎర్రజెండా నీడలో బతికిన ఆదర్శ కమ్యూనిస్టు నేత కామ్రేడ్ సీతారాం ఏచూరి అని జూబ్లీహిల్స్ సీపీఎం నాయకులు టి. సాయిశేషగిరి రావు, రాపర్తి అశోక్ అన్నారు. గురువారం బోరబండలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల నుంచి జాతీయ నేతగా ఎదిగిన వారిలో సీతారాం ఒకరని అన్నారు. సీతారాం మృతి పార్టీకి తీరనిలోటన్నారు. పార్టీ శ్రేణులంతా ఏచూరి ఆశయాల సాధనకు కృషి చేసి ఆయన రాజకీయ వారసులుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహేశ్‌కుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారానికి భారీగా తరలిరావాలి

● రాష్ట్ర గౌడ సంఘం తీర్మానం

ఖైరతాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్న మహేశ్‌కుమార్ గౌడ్‌కు రాష్ట్ర గౌడన్నలందరూ మద్దతు ప్రకటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర గౌడ సంఘం తీర్మానించింది. గురువారం పీవీ నర్సింహారావు మార్గంలోని నీరా కేఫ్‌లో తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం రాష్ట్ర, హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ మాట్లాడుతూ, మహేశ్ గౌడ్ ఎంతో శ్రమించి పార్టీకోసం పని చేశారని, ఇప్పుడు పార్టీలో గుర్తింపు రావడం సంతోషకరమన్నారు. ఈనెల 15వ తేదీన జరగనున్న మహేశ్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల గౌడ సంఘాల పెద్దలు హాజరవుతారని, మన రాష్ట్రంలోని గౌడ సోదరులందరూ కార్యక్రమానికి హాజరై మద్దతు తెలిపి ఐక్యత చాటాలని కోరారు. కల్లు గీత వృత్తిలో ఉన్న కార్మికులందరికీ ప్రభుత్వం సేఫ్టీమోకులు కల్పించాలని, ప్రమాద వశాత్తూ ఎవరైనా మరణిస్తే 10 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని తీర్మానించారు. మద్యం టెండర్లతో గౌడ్స్‌కు 25 శాతం రాయితీ కల్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా గౌడ సంఘం భవనాన్ని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు గోపుగాని వెంకటనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి గుండ్ల ప్రశాంత్‌గౌడ్, ప్రతినిధులు గట్టు రమేష్‌గౌడ్, లక్ష్మీపతి గౌడ్, గడ్డమీది అనురాధ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఆమ్‌ఆద్మీపార్టీ సనత్‌నగర్ డివిజన్ కన్వీనర్‌గా నియమితులైన శిరికంద లక్ష్మణ్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఆప్ తెలంగాణ కన్వీనర్ దిడ్డి సుధాకర్ తదితరులు - (సనత్‌నగర్ -ఆంధ్రజ్యోతి)

ట్రా 'ఫికర్' కట్టడికి ప్రత్యామ్నాయాలు!



జర్నలిస్టు కాలనీ చౌరస్తాలో విస్తరించిన రోడ్డు

- రోడ్లు, పబ్‌లు, వాణిజ్య సముదాయాల ముందు వాహనాల పార్కింగ్
- నిలిచిపోతున్న ట్రాఫిక్
- అక్రమ పార్కింగ్ చేయకుండా చర్యలు
- పశ్చిమాన పోలీసుల ప్రయోగాలు

బంజారాహిల్స్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రద్దీ రోజు రోజుకూ పెరిగిపోతోంది. కొన్ని దారుల్లో కిలో మీటర్ ప్రయాణానికి కనీసం పదిహేను నిమిషాలకు పైగానే పడుతుందంటే అతిశయోక్తి కాదు. ఈ ట్రాఫిక్ సమస్య పగలే కాదు.. రాత్రి పది దాటిన తర్వాత కూడా ఉంటోంది. ముఖ్యంగా పశ్చిమ మండలంలో అసలే ట్రాఫిక్ అధికం. దీనికి తోడు వీఐపీ కదలికలు ఉండటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఠాణాల పరిధిలో ఉదయం, సాయంత్రం వేళలో ప్రధాన రహదారులపై వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పంజాగుట్ట, ఎస్ఆర్‌నగర్ ఠాణాల పరిధిలో రోడ్డు రాత్రి వేళల్లో ట్రావెల్ బస్సులు, భారీ వాహనాలతో రద్దీగా ఉంటాయి. దీనికితోడు కాలిబాటలు చిరువ్యాపారులతో నిండిపోవడం, వాణిజ్య సముదాయాల ముందు వాహనాలతో తరుచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీనిపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన పోలీసులు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు.

దృష్టి సారిస్తున్న ప్రాంతాలు..

- బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లోని కేన్సర్ ఆసుపత్రి కూడలితో పాటు జహీరానగర్ వెపు వెళ్లే ప్రధాన రహదారిలో కార్లను నిలుపుతున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించిన పోలీసులు కార్లను ఆసుపత్రి ఆవరణలో నిలపాలని, ద్విచక్రవాహనాలను వెలుపల పెట్టించి పర్యవేక్షించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు సైతం చేశారు. అంతేకాకుండా కూడలిలోని ఆలయం పక్కన ద్విచక్ర వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకోన్నారు.
- అపోలో ఆసుపత్రి వద్ద ఉన్న రహదారి ఇరుకుగా ఉన్నట్లు గుర్తించారు. ప్రాథమికంగా అపోలో ఆసుపత్రి ముందు వాహనాలను నిలపకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అక్కడ రోడ్డుకు అడ్డంగా ఉన్న అంబులెన్స్‌ను తొలగించి మరో ప్రాంతంలో ఏర్పాటుచేశారు. ఇక ఆ ప్రాంతంలో ఉన్న వాణిజ్య సముదాయాలు, అతిథి గృహాలు రహదారిపై పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకొనేందుకు సిద్ధమవుతున్నారు.
- బంజారాహిల్స్ రోడ్ నంబర్ 3లోని మసీదును ఆనుకొని ఉన్న సందులో ఉన్న వాణిజ్య సముదాయాలకు వచ్చే వాహనాలను రహదారిపై నిలుపుతున్నారు. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో వ్యాపారులతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.
- జూబ్లీహిల్స్‌లోని ప్రధాన రహదారులను ఆనుకొని ఉన్న వ్యాపార సముదాయాలకు, పబ్‌లకు, హోటళ్లకు తగిన పార్కింగ్ సౌకర్యం లేదు. ఈ సంస్థలకు తాఖీదులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రధానంగా రోడ్ నంబర్ 36, 45 లోని పబ్‌ల కారణంగా తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడమే కాకుండా ముఖ్యమంత్రి నివాసం సైతం అక్కడే ఉండటంతో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.
- అమీర్‌పేట పంజాగుట్టలోని కొన్ని హోటళ్లు, వస్త్ర దుకాణాలకు వచ్చే వారి వాహనాలను రోడ్లపై నిలుపుతుండటంతో చర్యలు ఉపక్రమిస్తున్నారు. అలాగే రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటలలోపే భారీ వాహనాలకు అనుమతి ఉంది. ప్రైవేట్ ట్రావెల్స్ విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే అనుమతి లేకుండా సమయానికి ముందే వచ్చిన మూడు భారీ వాహనాలపై కేసులు నమోదు చేశారు.
- జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 1లోని జర్నలిస్టు కాలనీ కూడలిలోని చలపతిరావు విగ్రహాన్ని మరో ప్రాంతంలోకి తరలించడంతో పాటు రహదారిని విస్తరించారు.

ముందు నోటీసులు.. ఆ తర్వాత కేసులు



ఆపరేషన్ రోప్లో భాగంగా పశ్చిమ మండల పరిధిలో ఉన్న ఏడు ఠాణాల పరిధిలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టాం. వాహనాలు రహదారులపై నిలపకుండా ప్రయత్నాలు చేస్తున్నాం. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం. పార్కింగ్ లేని వారిని తగిన ఏర్పాట్లు చేసుకోవాలని చెబుతున్నాం. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతంలో టిప్పర్లు సైతం సాధారణ సమయాల్లో రహదారులపై తిరుగుతున్నట్లు తెలిసింది. వెంటనే కట్టడి చేస్తాం. నిబంధనలు ఉల్లంఘించిన వారికి తొలుత నోటీసులు ఇస్తున్నాం. అప్పటికీ మారకపోతే చర్యలు తీసుకుంటాం.

- కట్టా హరిప్రసాద్, ఏసీపీ, పంజాగుట్ట డివిజన్

ఆత్మహత్య ఆలోచనలను నివారించవచ్చు

- ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ అనిత



ఆత్మహత్యల నివారణ పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మానసిక ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): 'నిరాశ చెందవద్దు .. ఆత్మహత్య ఆలోచనలను నివారించవచ్చు' అని ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్ అనిత అన్నారు. గురువారం ప్రపంచ ఆత్మహత్య నివారణ వారోత్సవాల్లో భాగంగా ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి నుంచి ఎస్సార్ నగర్ వరకు ఆత్మహత్య నివారణ అవగాహన ర్యాలీని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం 8 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రపంచంలో మొత్తం మరణాలలో 1.4 శాతం ఆత్మహత్య లేనని తెలిపారు. ఆత్మహత్యలకు సాధారణ మానసిక రుగ్మతే కారణం అని అన్నారు. చాలామంది డిప్రెషన్‌కు లోనై తరచుగా చనిపోవాలని ఉందని లేదా ఆత్మహత్య గురించి మాట్లాడడం, నిరాశగా మాట్లాడడం, జీవించడంలో అర్థం లేదని అనుకోవడం చేస్తుంటారన్నారు. ఇలాంటి వారిని గమనించిన కుటుంబ సభ్యులు వారిని అక్కున చేర్చుకొని నీకు మేము ఉన్నామని ధైర్యం చెప్పాలన్నారు. వారి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అవగాహన ర్యాలీలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుధారాణి, వైద్యులు అలీమ్ చందాని, జార్జి రెడ్డి, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో పూజలో పాల్గొన్న చంచల్ గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్

మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శం

- చంచల్ గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్

పంజాగుట్ట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని చంచల్ గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్ అన్నారు. ఎర్రంమంజిల్‌లోని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆయన గురువారం పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన వేలం పాటలో 16,116 రూపాయలకు లడ్డూను ఆయన దక్కించుకున్నారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ బి-బ్లాక్ లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ నెల 14,15 తేదీలలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు



జనవిజ్ఞాన వేదిక 5వ మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, వరప్రసాద్ తదితరులు

పంజాగుట్ట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) 5వ రాష్ట్ర మహాసభలను ఈ నెల 14,15 తేదీలలో ఎఎస్ రావు నగర్ లోని అణుపురం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తామని వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వేదిక రాష్ట్ర కోశాధికారి ఆర్.వరప్రసాద్, కార్యదర్శి రాజా, మేడ్చల్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.బురాన్ లతో కలిసి ఆయన మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రెండు రోజుల పాటు జరుగనున్న ఐదవ రాష్ట్ర మహాసభలో అన్ని జిల్లాల నుంచి నాలుగు వందల మందికి పైగా సభ్యులు పాల్గొంటారని అన్నారు. వివిధ అంశాలపై చర్చ, ప్రముఖుల ప్రసంగాలు, భవిష్యత్ కర్తవ్యాలపై నిర్ణయాలు, నూతన కమిటీ ఎన్నిక ఉంటాయని తెలిపారు. సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్, ప్రముఖ పోషకాహార శాస్త్రవేత్త డాక్టర్ మోహతాబ్ ఎస్ బాంజీ, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ మోహన్ రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ దాసరి ప్రసాద రావు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ తదితరులు పాల్గొంటారన్నారు. రెండు రోజుల పాటు జరుగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి



పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు

పంజాగుట్ట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా గౌరవ వేతనం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తమ సమస్యలపై గురువారం తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ను సంఘం అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు, ప్రధానకార్యదర్శి రెడ్డిమల్ల, హన్మాండ్లు, కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.లక్ష్మీ నారాయణ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వచ్చే జనవరి నుంచి చౌక ధరల దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ చేయడానికి నిర్ణయించినందు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపు తున్నామని అన్నారు. రేషన్ దుకాణాల్లో మరిన్ని నిత్యావసర సరుకులు, వస్తువులు అందుబాటులోకి తెచ్చి అందించాలని కోరారు. రేషన్ డీలర్లకు కనీస గౌరవ వేతనం నెలకు ఐదు వేల రూపాయలు ఇవ్వాలని, కమీషన్ పెంచాలని డిమాండ్ చేశారు. వారి వెంట సంఘం ఉపాధ్యక్షుడు భానుచందర్, నాయకులు ఉన్నారు.

చిన్నారితో యువకుడి అసభ్య ప్రవర్తన

బంజారాహిల్స్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై కేసు నమోదైంది. వెంకటగిరి ప్రాంతంలో నివసించే పశ్చిమ బెంగాల్‌కు రాష్ట్రానికి చెందిన సాహెబ్‌సేన్(21) సమీపంలో నివసించే నాలుగేళ్ల చిన్నారిని తనతోపాటు తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 100కు సమాచారం అందించడంతో జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. చిన్నారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సాహెబ్‌సేన్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిందితుడు ఒక హోటల్‌లో వెయిటర్‌గా పని చేస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'జైబోలో గణేశ్ మహరాజ్'కి..

వాడవాడలా ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ జోన్ల పరిధిలో వాడవాడలా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల పరిసరాలు వినాయక నామస్మరణతో మార్మోగుతున్నాయి. 'జైబోలో మహరాజ్'కి అని కీర్తిస్తూ భక్తులు వేడుకల్లో పాల్గొంటున్నారు. నవరాత్రుల్లో ఆరవ రోజైన గురువారం మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు మండపాలను సందర్శించి గణేశుడికి పూజలు చేశారు. అన్నదానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ జోన్ల బృందం



మధురానగర్ బి-బ్లాక్ లోని గణపతి మండపంలో పూజలు చేసి అన్నదానంలో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



సనత్‌నగర్ డివిజన్ తులసీనగర్‌లోని సిద్ధివినాయక యూత్ అసోసియేషన్ గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు చేసిన రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



తులసీనగర్‌లోని వినాయక మండపంలో పూజలు నిర్వహించిన టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి సతీష్ తదితరులు



బంజారాహిల్స్ రోడ్డు నం. 13లో శివ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ నెలకొల్పిన వినాయకుడిని దర్శించుకున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



ఫిలింనగర్ మహాత్మాగాంధీనగర్‌లోని మండపంలో గణనాథుడిని దర్శించుకున్న యువకులు

ఖైరతాబాద్ గణపతిని దర్శించుకున్న చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్



గణపతిని దర్శించుకున్న తెలంగాణ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ విద్యాసాగర్ రెడ్డి తదితరులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ పూతలపట్టు విద్యాసాగర్‌రెడ్డి గురువారం ఖైరతాబాద్ గణపతిని దర్శించుకొని పూజలు చేశారు. ఆయనతో పాటు హైదరాబాద్ నగర సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ చిట్టూరి రామకృష్ణ, ఖైరతాబాద్ సీనియర్ పోస్ట్ మాస్టర్ జేఎస్ఎంయూఆర్ ప్రసాద్ ఉన్నారు.

దర్శించుకున్న క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్..

ఖైరతాబాద్ గణపతిని మాజీ భారత క్రికెట్ ఆటగాడు వెంకటేశ్ ప్రసాద్ దర్శించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరు గుతున్న ప్రసాద పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఆయన తిలకించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు రాంరెడ్డి, లక్ష్మణ్ యాదవ్, ప్రవీణ్‌కుమార్, మహేష్ యాదవ్, చందు, గజ్జెల ఆనంద్, వంశీకృష్ణ, శ్రీనివాస్ తదితరులు సత్కరించారు.

దానం కుటుంబసభ్యుల పూజలు



కుటుంబ సభ్యులతో కలసి గణపతి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ గణపయ్యను స్థానిక ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దానం నాగేందర్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ప్రతిరోజూ దానం నాగేందర్ ఆధ్వర్యంలో గణపతి దర్శనార్థం వస్తున్న భక్తులకు పెద్ద ఎత్తున ప్రసాదం పంపిణీ చేస్తారు. కాగా గురువారం భార్య, కూతుళ్లతో కలిసి దానం భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.



ఎమ్మెల్యే తలసానికి వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశన్ రాజు తదితరులు

ఆలయంలో తాగునీటి సదుపాయం కల్పించండి

పద్మారావునగర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట పరిధి న్యూబోయగూడలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో తాగునీటి సదుపాయం కల్పించాలని స్థానికులు కోరారు. ఈ మేరు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజుతో కలసి గురువారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీనిచ్చారు. ఆలయంలో నల్లా కనెక్షన్ ఏర్పాటుకు చర్యలు చేపడతానన్నారు.



సీతాఫల్‌మండి చౌరస్తాలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

హిందూ దేవతలను దూషించడం హేయమైన చర్య

బౌద్ధనగర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): హిందూదేవతలను దూషించడం హేయమైన చర్య అని, హిందూ దేవతలపై అనుచితంగా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశప్రజలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి చౌరస్తాలో ధర్నా చేశారు. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు ప్రపంచ వ్యాప్తంగా భారతజాతి అత్మగౌరవాన్ని, ఔన్నత్యాన్ని పెంచేందుకు ప్రధాని మోదీ యత్నిస్తుంటే... రాహుల్ గాంధీ మాత్రం భారతజాతి అత్మగౌరవాన్ని కించపరిచే యత్నం చేస్తున్నారని వారన్నారు. కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, వెంకటేశ్‌గౌడ్, పోచయ్యయాదవ్, ప్రభుగుప్తా, రాజేశ్వరి, మేకల కీర్తి, రాముదర్మ, శ్రీధర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు పాల్గొన్నారు.



నూతన మండల కార్యవర్గ సభ్యులు

మారేడుపల్లి మండల కమిటీ అధ్యక్షుడిగా సత్తిరెడ్డి

అడ్డగుట్ట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి మండల కమిటీ అధ్యక్షుడిగా సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.నరేష్ కుమార్ ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సికింద్రాబాద్ లాలాపేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు భట్టాపురం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మారేడుపల్లి మండల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అసోసియేట్ అధ్యక్షురాలుగా మంజుల, మహిళా ఉపాధ్యక్షురాలుగా రమణమ్మ, కార్యదర్శులుగా ఆస్మాఅంజామ్ ఎంపికయ్యారు. ఎన్నికల అధికారిగా దేవేందర్, పరిశీలకులుగా సైదులు వ్యవహరించారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఏ.ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దేవేందర్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నగరంలోని ఉజ్జయిని మహాకాళి అమ్మవారిని గురువారం దర్శించుకున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

- ఫొటో.. ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్



బోయినపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో గణేశుడుని దర్శించుకున్న మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి, జంపన ప్రతాప్



బోయిన్‌పల్లిలో వినాయకుడిని దర్శించుకున్న నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, రాముగౌడ్



గణేశుడి నిమజ్జన ఊరేగింపులో జక్కుల మహేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ముప్పిడి మధుకర్, చిట్టిబాబు



లాలాపేటలో గణేశుడికి పూజలు చేస్తున్న నగర మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి దంపతులు

భక్తిశ్రద్ధలతో గణపయ్యకు పూజలు

బోయిన్‌పల్లి/తార్నాక/సనత్‌నగర్/చిలకలగూడ/మారేడుపల్లి// సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు భజనలు, అర్చనలు చేస్తూ బొజ్జ గణపయ్యకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రాణాప్రతాప్ యూవసేన ఆధ్వర్యంలో బోయినపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో గణేశుడని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి, జంపన ప్రతాప్ దర్శించుకుని గురువారం పూజలు చేశారు. కంటోన్మెంట్ ఒకటో వార్డు తోకట్టలో ఏర్పాటు చేసిన వినాయకుడిని గురువారం నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ముప్పిడి మధుకర్, చిట్టిబాబ పాల్గొన్నారు. బోయిన్‌పల్లిలో ఏర్పాటుచేసిన భారీ వినాయకుడిని నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, రాముగౌడ్ దర్శించుకున్నారు. పార్సీగుట్ట షాబాద్‌గూడలో శ్రీగణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లష్కర్‌జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



వాసవీనగర్ కాలనీలో గణేశుడికి పూజలు చేస్తున్న కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ రామకృష్ణ తదితరులు

- నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా జైభవాని జై శివాజీ యువ సమితి ఆధ్వర్యంలో లాలాపేట్‌లోని లేబర్ అడ్డా వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నగర మాజీ మేయర్ బండ కార్తీకారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తార్నాక డివిజన్ మాణికేశ్వర్ నగర్‌లోని ఏడు టెంపుల్స్ ఆలయంలో ఏర్పాటు చేసిన మండపంలో ప్రముఖ సినీనటుడు విజయ్‌రాజా, యాంకర్ రీతు చౌదరి ముఖ్య అతిధులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు గండికోట విజయ్‌కుమార్, గిరిబాబు, నర్సింగ్, ప్రభాకర్, శివ, రాజేష్, గోపీ, నాగరాజు, నితీష్ పాల్గొన్నారు.
- సనత్‌నగర్ డివిజన్ తులసీనగర్‌లోని సిద్దివినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని గణేశుడిని ప్రార్థించినట్టు అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. నిర్వాహకులు అనిల్‌కుమార్ యాదవ్‌ను సన్మానించారు. వాసవీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధునికి కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ, అసోసియేషన్ ప్రతినిధులు పూజలు నిర్వహించారు.
- చాణక్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద మాజీ కార్పొరేటర్ శేషకుమారి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు హన్మంతరావు పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమీర్‌పేటలోని కౌశిక్ రామసాయి అపార్ట్‌మెంట్‌లో ప్రతిష్ఠించిన వినాయక వినాయక విగ్రహం వద్ద పూజలు చేసిన మండప నిర్వాహకులు



తులసీనగర్‌లోని వినాయక మండపంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి సతీష్ పూజలు నిర్వహించారు



మాణిక్యేశ్వర్ నగర్‌లో గణేశుడిని దర్శించుకుని పూజలు చేస్తున్న సినీనటుడు విజయ్‌రాజా, యాంకర్ రీతూచౌదరి



చాణుక్యనగర్‌లో గణేశుడికి పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ శేషుకుమారి తదితరులు



పార్సిగుట్ట షాబాద్‌గూడలో అన్నదానం చేస్తున్న శ్రీగణేశ్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు



చిలకలగూడ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన గణేశుడిని దర్శించుకొన్న అడిషనల్ డీసీపీ నరసయ్య

మురుగునీటి సమస్యకు పక్కా ప్రణాళికలు రూపొందించండి

అధికారులను ఆదేశించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే



ఈస్ట్ మారేడుపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడుపల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ పరిధిలో మురుగునీటి సమస్య పరిష్కారానికి పక్కా ప్రణాళికలు రూపొందించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఈస్ట్ మారేడుపల్లి టీచర్స్‌కాలనీ, లోహినగర్, వెస్ట్ మారేడుపల్లి గీతానర్సింగ్ హోమ్, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో జలమండలి జీఎం వినోద్‌కుమార్, డీజీఎం విద్యాసాగర్, ఏఈలు స్రవంతి, అఖిల్, శానిటేషన్ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, మురుగునీటి సమస్యపై ఆరా తీశారు. 20 ఏళ్లుగా తరచూ మురుగునీటి సమస్య వస్తుందని, అధికారుల తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారని చెప్పారు. స్థానిక ప్రజలు వారి నివాస ప్రాంతాల్లో గౌరవప్రదంగా ఉండేలా పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం కల్పిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. మురుగు నీరు పారుతున్న ప్రాంతాల్లో మరమ్మత్తులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా ప్రాంతాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లి ఫాగింగ్ చేయాలని శానిటేషన్ మెడికల్ అధికారికి సూచించారు. టీచర్స్ కాలనీ క్రీడామైదానంలో పారిశుధ్య మహిళా కార్మికులు కనీస అవసరాలైన బాత్రూంను నిర్మించాలని ఏఈ రవిందర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు నాగేష్ యాదవ్, బాబురావు, సదానంద్ గౌడ్, బద్రీనాథ్, సంతోష్‌యాదవ్, శేఖర్ ముదిరాజ్, భాస్కర్, తేజ్‌పాల్ పాల్గొన్నారు.

పెండింగ్ రైల్వే ప్రాజెక్టు పనులను పూర్తి చేయండి

- రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తో ఎంపీ నాగేష్ భేటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టు పనులను చేపట్టి త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ జి.నగేష్ రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబుతో కలిసి ఎంపీ నగేష్ సికింద్రాబాద్ రైల్‌నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌తో గురువారం సమావేశమయ్యారు. ఆదిలాబాద్, మంచిర్యాల్, సిర్పూర్ కాగజ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణ, రైల్వే వంతెన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎంపీ నాగేష్, ఎమ్మెల్యే హరీష్‌బాబు కోరారు.



నియామకం

ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) సనత్ నగర్ డివిజన్ కన్వీనర్‌గా నియమితులైన శిరికంద లక్ష్మణ్‌కు నియామకపత్రం అందజేసి అభినందిస్తున్న ఆప్ తెలంగాణ కన్వీనర్ దిడ్డి సుధాకర్ తదితరులు.

- సనత్‌నగర్, (ఆంధ్రజ్యోతి)



పురస్కారగ్రహీతలను సత్కరిస్తున్న అతిథులు

మహాకవి కాళోజి పురస్కారాలు ప్రదానం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి, గోల్కొండ సాహితీ కళాసమితి, సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి కాళోజి నారాయణరావు 110వ జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి రామకృష్ణ చంద్రమౌళి, సాహితీవేత్త నారాయణస్వామి, కనకయ్య మల్లములకు కాళోజి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.ఎన్.బాలాచారి పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి కాళోజి రచనలు స్ఫూర్తిగా నిలిచాయని, ఆయన పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నల్లగుంట్ల యాదగిరిరావు, మనోహర రెడ్డి, దైవజ్ఞశర్మ, నాళేశ్వరం శంకరం, శ్రీనివాస్ యాదవ్, బడేసాబ్, బద్రినాథ్, సరోజినీదేవి తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు చెత్తను సేకరణ బండ్లను పంపిణీ చేస్తున్న ఉప కమిషనర్ సుభాష్‌రావు

ప్రతి ఇంటికీ వెళ్లి చెత్తను సేకరించాలి

బౌద్ధనగర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు ప్రతి ఇంటికీ వెళ్లి చెత్తను సేకరించాలని సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ సుభాష్‌రావు, కార్పొరేటర్ సామల హేమ సూచించారు. గురువారం సీతాఫల్‌మండిలో చెత్తను సేకరించే బండ్లను పారిశుధ్య కార్మికులకు అందజేశారు. చెత్తను రోడ్లపై వేస్తున్న వారికి జరిమానా విధించి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్, ఎస్ఎఫ్ఐలు పాల్గొన్నారు.



పార్సిగుట్టలో రోడ్లకు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు

రోడ్ల మరమ్మతు పనుల పరిశీలన

బౌద్ధనగర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): పార్సీగుట్టలో రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేస్తున్నారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి గురువారం ఆ ప్రాంతంలో పర్యటించి అక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. గణేశుడి విగ్రహాల నిమజ్జనానికి వెళ్లే వాహనాలకు ఇబ్బందుల్లేకుండా పలుప్రాంతాల్లో రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టామని కార్పొరేటర్ తెలిపారు. ఇప్పటికే నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



పిల్లలు, వారి తల్లులతో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

డ్రాప్ అవుట్ పిల్లల కోసం స్పెషల్ డ్రైవ్

అడ్డగుట్ట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ మధ్యలోనే ఆపేసిన(డ్రాప్ అవుట్) పిల్లలకోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టామని తెలంగాణ తల్లుల సంఘం కన్వీనర్ జి. భాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం మారేడుపల్లి మండల పరిధిలోని అడ్డగుట్ట తుకారాంగేట్, ఇందిరాలక్ష్మీనగర్ బస్తీలో ఇంటింటికి సర్వే చేశారు. తల్లిదండ్రులు, వారి పిల్లలకు విద్య ప్రాముఖ్యతను వివరించి, తిరిగి పాఠశాలలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు సువర్ణ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్

బ్రాహ్మణబస్తీలో బీజేపీ సభ్యత్వ నమోదు

బౌద్ధనగర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ బ్రాహ్మణబస్తీలో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ సికింద్రాబాద్ మహాకాళి జిల్లా మీడియా జాయింట్ కో-ఆర్డినేటర్ అజయ్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్ సభ్యత్వం చేయించారు. ప్రతిపోలింగ్‌బూత్‌లో దాదాపు 2 వందల మందిని సభ్యులను చేర్పించేలా కృషి చేయాలని రవిప్రసాద్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో సభ్యత్వ కన్వీనర్ హరి, సి.సురేష్, ఎస్.మహేశ్, సతీష్‌రాజ్, లక్ష్మణ్, నగేశ్, సీతాకుమారి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

బ్యాండ్ బాజాకు భలే గిరాకీ

అల్వాల్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలను మండప నిర్వాహకులు అంగరంగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా భక్తులకు గణేశ్ ఉత్సవాలు అంటేనే బ్యాండ్, బాజా, డ్యాన్స్‌లు చేయడం ప్రత్యేకంగా చెప్పవచ్చు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో బ్యాండ్‌బాజాకు విపరీతమైన గిరాకీ ఉంటుంది. నిమజ్జన ఊరేగింపులో డీజేలకు పోలీసుల అనుమతి లేకపోవడంతో బ్యాండ్‌మేళకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. పదకొండు రోజుల పాటు అంగరంగా వైభవంగా పూజలందుకునే గణనాథునికి నిర్వాహకులు బ్యాండ్ మేళాలతో ఘనంగా ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలిస్తుండటంతో అల్వాల్ సర్కిల్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసిన తీన్మార్ బ్యాండ్‌మేళాల చప్పుళ్ల ,డ్యాన్స్‌లు చేస్తూ ఈలల, గోలలతో కాలనీల్లోని రోడ్లన్ని సందడిగా మారుతున్నాయి.

పొరుగు రాష్ట్రాల నుంచి..

హైదరాబాద్ నగరంలో చవితి పండుగ కోసం మండప నిర్వాహకులు కర్ణాటక, గుల్బర్గా, మహరాష్ట్ర, ముంబై తదితర ప్రాంతాలకు చెందిన బ్యాండ్ బృందాలను ముందుగానే బుక్ చేసుకుని తీసుకువస్తున్నారు. ఐదు రోజులుగా ప్రారంభమైన నిమజ్జనంతో బ్యాండ్ బృందాల భాజాలతో మారుమోగుతున్నాయి. 5 నుంచి 11 మంది ఒక గ్రూపుగా ఏర్పడి గిరాకీ కోసం బృందాలు ఎదురు చూస్తున్నాయి. ఒక్కో నిమజ్జనానికి రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు తీసుకుని బ్యాండ్ వాయిస్తున్నారు.



గణపతి మండపం ముందు బ్యాండ్ కొడుతున్న దృశ్యం

తీన్మార్‌తో దద్దరిల్లుతున్న మండపాలు

గణనాథునికి ప్రత్యేక పూజలు చేస్తున్న మండప నిర్వాహకులు, భక్తులు గణపతిని నిమజ్జనానికి తరలించే సమయంలో డప్పు వాయుద్యాలకు అనుగుణంగా తీన్మార్ డ్యాన్స్‌లతో అదరగొడుతున్నారు.

సౌండ్ లేకుంటే జోష్ ఉండదు



పెళ్లి ఊరేగింపుకే కాదు గణేశ్ నిమజ్జనానికి కూడా బ్యాండ్ సౌండ్ లేకుంటే మజానే ఉండదు. తీన్మార్ డ్యాన్స్ ఉత్సాహాన్ని ఇచ్చే పాటలతో స్టెప్పులు వేయాలంటే బ్యాండ్ ఉండాల్సిందే.

-కృష్ణ, అల్వాల్

ఆట పాటలంటేనే గణేశుడికిష్టం



గణేశ్ నిమజ్జనంలో బ్యాండ్ లేకపోతే నిమజ్జనం చేసినట్లే అనిపించదు. ఆట, పాట డ్యాన్స్‌లు ఉంటే గణనాథునికి చాలా ఇష్టం. అందుకే తాము నిమజ్జన సమయంలో కులమతాలకతీతంగా ఐకమత్యంగా యువకులు, మహిళలందరూ డ్యాన్స్‌కు అనుగుణంగా చిందులేస్తారు.

- మహేశ్, అల్వాల్

చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడు

- కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై కేసు నమోదైంది. వెంకటగిరి ప్రాంతంలో నివసించే పశ్చిమ బెంగాల్‌కు రాష్ట్రానికి చెందిన సాహెబ్ సేన్(21) సమీపంలో నివసించే నాలుగేళ్ల చిన్నారిని తనతోపాటు తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 100కు సమాచారం అందించడంతో జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. చిన్నారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సాహెబ్ సేన్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిందితుడు ఒక హోటల్‌లో వెయిటర్‌గా పని చేస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు



రోడ్డు భద్రతపై ట్రైనీ పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

అంబర్‌పేట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రైనీ పోలీసులకు రోడ్డు భద్రతపై అంబర్‌పేట పీటీసీలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి, బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. లైసెన్స్‌లు లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానా, మూడు నెలల జైలు శిక్ష ఉంటుందన్నారు. వాహనం నడిపే వ్యక్తి వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రైనీ పోలీసుల సందేహాలకు వారు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో 400 మంది ట్రైనీ పోలీసులు పాల్గొన్నారు.